క్లుప్తంగా

కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్ / వనస్థలిపురం రైతుబజార్లలో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 19, వంకాయ 18, బెండ 50, పచ్చి మిర్చి 45, కాకర 35, బీర 45, క్యాబేజి 10, ఫ్రెంచిబీన్స్ 50, క్యారెట్ 15, దొండ 35–37, చిక్కుడు 35, గోకర 45, బీట్‌రూట్ 17, క్యాప్సికం 43, ఆలు 18, దోస 35, సొర 13, పొట్ల 15, ఉల్లి 14, చామగడ్డ 70 ప్రకారం ధర పలుకుతున్నాయి. ఈ ధరలు శుక్రవారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

అనాథ యువతి వివాహానికి చేయూత



అమ్మాయికి పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఉప్పల స్వప్న

నాగోలు: పేదలకు ఉప్పల ఫౌండేషన్ చేయూతనిస్తుందని ఉప్పల ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్న అన్నారు. మలక్‌పేటకు చెందిన తల్లిదండ్రులు లేని సుధానంద అనే యువతి గురువారం ఉప్పల స్వప్నను కలిసింది. ఆ అమ్మాయి కుటుంబ పరిస్థితి, తల్లిదండ్రులు లేని విషయాన్ని, ఆర్థిక ఇబ్బందులు తెలుసుకొని ఆ అమ్మాయి వివాహం కోసం ఫౌండేషన్ కో చైర్ పర్సన్ ఉప్పల స్వప్న మంగళ సూత్రం, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు.

నేటి నుంచి ఉచిత వినికిడి పరీక్షలు

వనస్థలిపురం: ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకొని మార్చి 3 నుంచి 5వ తేదీ వరకు చైతన్యపురి ఎక్స్ రోడ్డులోని మ్యాగ్నస్ స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ వద్ద ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కన్సల్టేషన్, వినికిడి స్క్రీనింగ్ పరీక్షలు, చెవి మిషన్ ట్రయల్ ఉచితంగా నిర్వహిస్తామన్నారు. వివరాలకు ఫోన్స్: 97032 35513, 99856 31926లలో సంప్రదించాలని వారు సూచించారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు ప్రారంభం



గోవు పూజ చేస్తున్న వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్ డిఫెన్స్ కాలనీ కర్మన్‌ఘాట్‌లోని బైరామల్‌గూడలోని హరిహర క్షేత్ర అయ్యప్ప ఆలయ పుష్కర బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగవైభవంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గోపూజ యాగశాల ప్రవేశం గణపతిపూజ శ్రీలక్ష్మీ గణపతి హోమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయి. పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ వ్యవస్థాపక చైర్మన్, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి దంపతులు హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, ధర్మకర్తలు మిర్యాల అంజయ్యగుప్తా, బొడ్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

నేడు మహాపాదయాత్ర

బడంగ్‌పేట్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నేడు బడంగ్‌పేట కార్పొరేషన్‌లో మహాపాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తెలిపారు. ముఖ్యఅతిథిగా మంత్రి సబితారెడ్డి పాల్గొంటారన్నారు. అల్మాస్‌గూడలోని హనుమాన్ ఆలయం నుంచి బడంగ్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహం వరకు పాదయాత్ర నిర్వహించి ధర్నా, కట్టెల పొయ్యితో వంట చేస్తామన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

సీసీ కెమెరాలో రికార్డయిన ప్రమాద దృశ్యాలు

నాగోలు: వేగంగా వచ్చిన కారు ఢీకొన్న ప్రమాదంలో నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఎల్‌బీనగర్ పోలీసుల సమాచారం మేరకు... నాగోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద గుర్తు తెలియని వ్యక్తిని గుర్తు తెలియని కారు ఢీ కొట్టింది. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘోర ప్రమాద దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాలో నమోదయ్యాయి. సదరు వ్యక్తి దారి పక్క నుంచి సెల్‌ఫోన్ చూసుకుంటూ నాగోలు మెయిన్ రోడ్డు వైపు నడుస్తున్నాడు. అదే సమయంలో గుర్తు తెలియని కారు ఎదురుగా వేగంగా దూసుకొచ్చి అతడిని ఢీకొట్టడంతో అతడు గాల్లోకి ఎగిరి దూరంగా తల్లకిందులుగా పడిపోయాడు. స్థానికులు ఓ అంబులెన్సులో అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం. ప్రమాదంలో వ్యక్తికి తలకు తీవ్ర గాయాలయినట్లు స్థానికులు తెలిపారు. కారులో ఇద్దరు మహిళలు ఉన్నారని తెలిసింది. ప్రమాద ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నీటి వృథాపై నిర్లక్ష్యం



అక్బర్‌బాగ్ గవర్నమెంట్ క్వార్టర్స్‌లో..

తాగునీటి వృథాను అరికట్టడంలో జలమండలి అధికారులు విఫలం అవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మంచి నీరు అమూల్యం.. పొదుపుగా.. జాగ్రత్తగా వాడుకోవాలని.. వృథా చేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించే అధికారులు నీటి వృథాను మాత్రం అరికట్టే విషయంలో నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాల్వ్‌ల లీకేజీలు, పైప్‌లైన్‌లు పగిలి గంటల కొద్దీ.. రోజుల తరబడి తాగునీరు రోడ్లపై వరదలా ప్రవహిస్తున్నా వారిలో స్పందన లేదంటూ దుమ్మెత్తిపోస్తున్నారు.



హెగ్డే ఆస్పత్రి పక్కలైన్‌లో..

- ఎక్కడ చూసినా నీటి లీకేజీలే...
- రోడ్డు పాలవుతున్న తాగునీరు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

మలక్‌పేట: మలక్‌పేట డివిజన్ అస్మాన్‌ఘడ్ సెక్షన్‌లోని మూసారంబాగ్, అక్బర్‌బాగ్ డివిజన్లలోని పలు ప్రాంతాలలో నల్లాల్లో నీరు వదిలినప్పుడు తాగునీటి వృథా సర్వసాధారణంగా కన్పిస్తుంది. కాలనీల్లో ఎక్కడ చూసినా లీకేజీలే దర్శనమిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ లేనికారణంగా వేలాది గ్యాలన్ల నీరు వృథా అవుతున్నాయి. లోప్రెషర్, మరోవైపు కలుషిత నీటి సరఫరాతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్యలు పరిష్కరించడంలో అధికారులు విఫలం అవుతున్నారు. లీకేజీలపై శ్రద్ధ తీసుకోవాలని, ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించి తాగునీటి వృథా అరికట్టడానికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నాసిరకం పనులతో...

సలీంనగర్‌లో ఇటీవల డ్రైనేజీ పాతపైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ వేశారు. ఈ క్రమంలో తాగునీటి పైప్‌లైన్ పగిలి వాటర్ లీకేజీ అవుతుంది. దాదాపు పక్షం రోజులుగా నీరు వృథాగా పోతోంది. పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసిన దాఖలాలు లేవు. నీటి వృథాను స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీస ప్రయోజనం లేదు.



సలీంనగర్‌లో కొత్త పైప్‌లైన్ వేసిన ప్రాంతంలో వృథా అవుతున్న తాగునీరు

నీరు వృథా అవుతున్న ప్రాంతాలివే..

- ముంతాజ్ కాలేజీ ఎదురుగా రెండు చోట్ల
- బాలిక జూనియర్ కాలేజీ చౌరస్తాలో...
- మూసారంబాగ్ ఆరోరా కాలేజీ ఎదురుగా
- మూసారంబాగ్ హెగ్డే ఆస్పత్రి పక్క లైన్‌లో..
- అక్బర్‌బాగ్ ప్రభుత్వ క్వార్టర్స్‌లోని పెన్షన్ ఆఫీస్ వద్ద...
- టీవీ టవర్ కార్యాలయం ఎదురుగా సలీంనగర్‌లో..
- సలీంనగర్ మోర్ మార్కెట్ చౌరస్తాలో...

వెంటనే వృథాను అరికట్టాలి



వేసవి ప్రారంభం అవుతోంది.. తాగునీటి వృథాను అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రోజుల తరబడి రోడ్లపై నీటి కాలువ మాదిరిగా రోడ్లపై నీరు ప్రవహిస్తున్నది. మురుగు పరిస్థితీ ఇలాగే ఉంది. అధికారులు సమస్యలపై శ్రద్ధ పెట్టరు. ఫిర్యాదు చేసినా.. సమస్య పరిష్కారం కావడం లేదు. ఉన్నతాధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని నీటి వృథాను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– శ్రీనివాస్‌రావు, మూసారంబాగ్

వంట గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి

హోంమంత్రి మహమూద్ అలీ



చాదర్‌ఘాట్ వద్ద ధర్నాలో పాల్గొన్న హోంమంత్రి మహమూద్ అలీ

చాదర్‌ఘాట్: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని హోం మంత్రి మహమూద్ అలీ డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధరలను వ్యతిరేకిస్తూ బీఆర్‌ఎస్ మలక్‌పేట నియోజకవర్గం ఇన్‌చార్జ్ అజంఅలీ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్ చౌరస్తా వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ... 2014వ సంవత్సరంలో గ్యాస్ ధర రూ. 450 ఉండగా ప్రస్తుతం రూ. 1150కు చేరుకుందన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచడంతో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నాయన్నారు. సార్వత్రిక ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అమలులో ప్రధాని నరేంద్ర మోడీ విఫలం అయ్యారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో బీఆర్‌ఎస్ దేశవ్యాప్తంగా విస్తరించి కేసీఆర్ ప్రధాన మంత్రి అయితే ప్రజల కష్టాలు తీరుస్తారని ధీమా వ్యక్తం చేశారు. రైతుల సంక్షేమం కోసం, అన్నివర్గాల ప్రజల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు.

గ్యాస్ ధర పెంపుపై కాంగ్రెస్ నిరసన



సాగర్ రింగ్ రోడ్డులో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

లింగోజిగూడ: పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఆందోళన చేశారు. పెరిగిన గ్యాస్ ధరలకు నిరసనగా సాగర్ రింగ్ రోడ్డులో గురువారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం పేదలను దోచి పెద్దలకు పెడుతోందని ఆరోపించారు. కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు మిద్దెల జితేందర్, జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, గజ్జి భాస్కర్, రాజ్‌కుమార్, శశిధర్‌రెడ్డి, మల్లారపు శ్రీనివాస్, బుడ్డ సత్యనారాయణ పాల్గొన్నారు.

న్యాయవాది ల్యాప్‌టాప్ మాయం

రంగారెడ్డి కోర్టులు: జిల్లా కోర్టు ప్రాంగణంలోని వాహనాల పార్కింగ్‌లో నిలిపి ఉన్న యువ న్యాయవాది కారులోని ఓ ల్యాప్‌టాప్ చోరీకి గురైంది. వివరాలివీ... న్యాయవాది ప్రమోద్ గురువారం తాను వృత్తిరీత్యా వాడుకునే లాప్‌టాప్‌ని కారులో ఉంచి వాదనలు వినిపించేందుకు కోర్టులోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి కారులోని ల్యాప్‌టాప్ కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు న్యాయవాది ప్రమోద్ తెలిపారు. ల్యాప్‌టాప్ విలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని, అందులో పొందుపర్చిన విలువైన సమాచారాన్ని కోల్పోయానని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

కుక్కల బెడద నివారణకు కృషి



అబిడ్స్: కుక్కల బెడద నివారణకు ప్రత్యేక కృషి చేస్తామని గ్రేటర్ మేయర్ గద్వాల విజయలక్ష్మి పేర్కొన్నారు. గన్‌ఫౌండ్రీ డివిజన్ మాజీ కార్పొరేటర్ మమతా గుప్తా కుక్కల బెడదను నివారించాలని మేయర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గన్‌ఫౌండ్రీతో పాటు అన్ని ప్రాంతాల్లో కుక్కల బెడద నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించం

ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ



మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ పంకజ

ఎల్‌బీనగర్: పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించమని... సిబ్బంది, అధికారులు తమ పనితీరును మెరుగు పరుచుకోవాలని ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ పేర్కొన్నారు. ఎల్‌బీనగర్ జోనల్ పరిధిలోని ఎల్‌బీనగర్, హయత్‌నగర్, సరూర్‌నగర్, కాప్రా, ఉప్పల్ అధికారులతో జోనల్ కమిషనర్ స్వచ్ఛ సర్వేక్షణ్ 2023, శానిటేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా తీసుకోవాల్సి చర్యలపై ప్రాజెక్ట్ మేనేజర్ సోమ భరత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు వివరించారు. అనంతరం పంకజ మాట్లాడుతూ... స్వచ్ఛ సర్వేక్షణ్‌కు 9500 మార్కులు కేటాయించాని, వీటిని సాధించడానికి ప్రతి ఒక్కరూ గ్రౌండ్ లెవల్ నుంచి పని చేయాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. స్వచ్ఛ ఆటోల హాజరును, పబ్లిక్ టాయిలెట్ల శుభ్రతపై ఎస్‌ఎఫ్‌ఏల వారీగా మెరుగు పరిచాలని ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కమిషనర్‌లు ఉమ ప్రకాష్, శశిరేఖ, చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజ, ఉప కమిషనర్‌లు మారుతీదివాకర్, సురేందర్‌రెడ్డి, కృష్ణయ్య, శంకర్, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌లకు గుణపాఠం తథ్యం: మల్‌రెడ్డి

చైతన్యపురి: బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు తరిమికొట్టే రోజు త్వరలో వస్తుందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇంచార్జి మల్‌రెడ్డి రాంరెడ్డి అన్నారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసం ప్రజలను తీవ్ర ఇబ్బందులు పాలు చేస్తున్నదని విమర్శించారు. నిత్యావసర ధరలు పెంచుకుంటూ పోతే పేద మధ్య తరగతి ప్రజలు ఎలా బతకాలని ప్రశ్నించారు. సామాన్యులపై మరింత భారం మోపేందుకే గ్యాస్ సిలిండర్ ధరను పెంచిందని.. కేంద్రం చర్య సరికాదన్నారు. అదాని కళ్లలో ఆనందం చూసేందుకు పేద ప్రజల బతుకులను రోడ్డు పాల చేయటం బీజేపీకే చెల్లిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా రూ. 410 ఉన్న సిలిండర్ ధర ఇప్పుడు మూడు రెట్లు పెంచిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కరెంటు బిల్లులు, బస్ చార్జీలు, రిజిస్ట్రేషన్ల చార్జీలు పెంచిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వాని దక్కిందని ఆయన ఎద్దేవా చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి ఇష్టాను సారంగా ధరలు పెంచి ప్రజల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తక్షణమే నిత్యావసర వస్తువుల ధరలు నియంత్రించి పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా ఉంటుందన్నారు.

న్యాయవాద వృత్తి సామాజిక ఇంజినీరింగ్ వంటిది

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్



లా విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న వినోద్‌కుమార్ తదితరులు

చైతన్యపురి: న్యాయవాద వృత్తి సామాజిక ఇంజినీరింగ్ వంటిదని, అట్టడుగు, అణగారిన వర్గాలకు న్యాయవాద వృత్తి ద్వారానే న్యాయం అందుతుందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. గురువారం చైతన్యపురిలోని రాష్ట్ర ప్రభుత్వ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల విద్యా సొసైటీ నిర్వహిస్తున్న మహిళా న్యాయ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గురుకుల విద్యా సొసైటీ ద్వారా దేశంలోనే తొలిసారిగా మెన్, ఉమెన్ లా కళాశాలలను నిర్వహిస్తుండటం గొప్ప విషయం అన్నారు. లా విద్యార్థులు సామాజిక అంశాలపై పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలన్నారు. రాజ్యాంగంలోని ప్రియాంబుల్ (పీఠిక)కు అనుగుణంగా లా విద్యార్థులు ముందుకు సాగాలని, పౌరహక్కులు, ఆదేశిక సూత్రాలను అనుసరించాలని తద్వారా న్యాయవాద వృత్తిలో గొప్పగా రాణించవచ్చని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల మారుమూల ప్రాంతాలకు చెందిన బలహీన, బడుగు వర్గాలకు చెందిన విద్యార్థినులు లా కళాశాలలో చదువుతుండటం గొప్ప విషయం అని వినోద్‌కుమార్ అన్నారు. లా విద్యార్థినులతో సహపంక్తి భోజనం చేశారు. సదస్సులో హైకోర్టు అడ్వకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్, రాష్ట్ర ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ గోస్, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ మానస, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుష్పాంజలి, గురుకుల విద్యా సొసైటీ ఓఎస్‌డీ డాక్టర్ పావని, లా విద్యార్థులు పాల్గొన్నారు.

జోడో యాత్రను విజయవంతం చేయండి

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్‌లో నిర్వహించే హాత్‌సే హాత్ జోడో అభియాన్ యాత్ర ను విజయవంతం చేయాలని గురువారం కాంగ్రెస్ పార్టీ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్నా గణేష్‌నేత ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తా నుంచి ఉదయం 8.30 గంటలకు గడపగడపకూ పాదయాత్ర కార్యక్రమం ఉంటుందని, కావునా, నాయకులు, కార్యకర్తలు, ఎన్‌ఎస్‌యూఐ నాయకులు పాల్గొనాలని కోరారు.

హామీలు మరిచిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం

రామంతాపూర్: రామంతాపూర్ డివిజన్ టీవీ స్టూడియో నల్ల పోచమ్మ ఆలయం నుంచి టీపీసీసీ సభ్యులు వినోద్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ జోడో యాత్ర ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి హాజరై జోడో యాత్రను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామన్నారు. బీఆర్‌ఎస్ హామీలను మరిచి కేవలం ప్రకటనలకే పరిమితమైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మేకల శివారెడ్డి, పసూల ప్రభాకర్‌రెడ్డి, ఆగిరెడ్డి, పత్తి కుమార్, రఫిక్, మల్లిఖార్జున్‌గౌడ్, సుధాకర్, జై.నవీన్, భాస్కర్‌రెడ్డి, అంజయ్య, సంజీవరెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, సుధాకర్‌శెట్టి, పాల్గొన్నారు.

జనార్దన్‌రెడ్డిని గెలిపిద్దాం: పీఆర్టీయూ

హయత్‌నగర్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్టీయూ అభ్యర్థి కాటెపల్లి జనార్దన్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన మద్దతుదారులు గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ నాయకులు వెంకట్‌రెడ్డి, సత్తిరెడ్డి మాట్లాడుతూ... ఉపాధ్యాయులకు పిల్లల సంరక్షణ సెలవులు, పీఆర్సీలో 30శాతం ఫిట్మెంట్ ఇప్పించేందుకు జనార్దన్‌రెడ్డి కృషిచేశారని తెలిపారు. రానున్న రోజుల్లో పండిట్, పీఈటీ ఉపాధ్యాయుల సమస్యలపై పోరాటం, 317 జీఓ కారణంగా ఇతర జిల్లాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సొంత జిల్లాలకు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్తారి రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చీకోటి ప్రవీణ్ కారు చోరీ కేసులో నలుగురి అరెస్ట్

పరారీలో ప్రధాన నిందితుడు



స్వాధీనం చేసుకున్న కారుతో సైదాబాద్ పోలీసులు

సైదాబాద్: క్యాసినో వ్యాపారి చీకోటి ప్రవీణ్‌కుమార్ కారు చోరీ కేసులో నలుగురు నిందితులను సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. గురువారం సైదాబాద్ డీఐ చంద్రమోహన్ వివరాలు వెల్లడించారు. వినయ్‌నగర్ కాలనీలో ఉంటున్న చీకోటి ప్రవీణ్‌కుమార్‌కు చెందిన ఇన్నోవా క్రిస్టా కారును గత నెల 19న రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. కర్మన్‌ఘాట్ శ్రీరాంనగర్‌కు చెందిన గుండె శివప్రసాద్ పాత నేరస్తుడు. అతనిపై హైదరాబాద్, రాచకొండ పరిధిలో 13 కేసులు ఉన్నాయి. జైలులో అతడికి నేరేడ్‌మెట్‌కు చెందిన పాత నేరస్తుడు సుమీత్ నాయక్‌తో పరిచయం ఏర్పడింది. అతని ద్వారా నేరేడ్‌మెట్‌కే చెందిన మరో నేరస్తుడు యేపూరి నిఖిల్, సతిక రాహుల్, మల్లెల సాయికిరణ్ పరిచయమయ్యారు. ఈనెల 19న కలుసుకున్న వారు విలాసాల కోసం కారు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. చీకోటి ప్రవీణ్ కారును పార్క్ చేసిన డ్రైవర్లు తాళాలను వాచ్‌మెన్ టేబుల్ సొరుగులో పెట్టడాన్ని గుర్తించిన శివప్రసాద్ తాళాలు తీసుకుని కారును తస్కరించి దారిలో మిగిలిన నలుగురిని ఎక్కించుకుని నేరేడ్‌మెట్‌కు, అక్కడి నుండి కీసరలో జాతరకు వెళ్లారు. తిరిగి వారిని నేరేడ్‌మెట్‌లో దించి తాను ఇంటికి తిరిగి వెళుతుండగా గడ్డిఅన్నారం వద్ద ఓ బైక్‌ను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయాడు. పోలీసులకు దొరికిపోతానన్న భయంతో కారును అక్కడి వెంకటేశ్వర ఆలయం వద్ద వదిలి పారిపోయాడు. మరుసటి రోజు డీఐ చంద్రమోహన్ కారును స్వాధీనం చేసుకున్నారు. సాంకేతిక ఆధారాలతో నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

రోడ్డు మధ్య విద్యుత్ స్తంభాలు తొలగించాలి

హుడాకాంప్లెక్స్: రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వాహనదారులకు అసౌకర్యంగా మారిందని, వెంటనే ఆ స్తంభాలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఇంజినీరింగ్ అధికారులకు సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి సూచించారు. గురువారం సరూర్‌నగర్ డివిజన్ చాడీ ప్రాంతంలో దారి మధ్యలో ఉన్న స్తంభాన్ని ఏఈ నరసింహ శెట్టితో కలిసి సందర్శించారు. వీలైనంత త్వరగా సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో స్థానికులు సుదర్శన్, దర్శన్, నిజాముద్దీన్, బీజేపీ నాయకులు ఆరుట్ల సురేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపునకు సిద్ధం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 16వ తేదీన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను గురువారం ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి ఎస్. పంకజ పోలీసు అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పంకజ మాట్లాడుతూ ఈ నెల13న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన పోలింగ్ జరగనుందని తెలిపారు. అనంతరం జరిగే లెక్కింపు ప్రక్రియకు సంబంధించి అంతా సిద్ధం చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌బీనగర్ ఏసీపీ శ్రీధర్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ కృష్ణయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వనస్థలిపురంను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతా

కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి





వనస్థలిపురం: ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతూ కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి వనస్థలిపురం డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. కార్పొరేటర్‌గా గెలుపొంది రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆయనతో 'సాక్షి' ఇంటర్వ్యూ.

ప్రశ్న: ఈ రెండేళ్లలో ఎన్ని కోట్ల నిధులతో, చేసిన అభివృద్ధి పనులు ఏమిటి?

జవాబు: ఈ రెండేళ్ల కాలంలో డివిజన్‌లో రూ. 17 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టాము. ముఖ్యంగా క్రిస్టియన్ కాలనీ, శ్రీ కృష్ణా నగర్, గుంటి జంగయ్యనగర్, సద్గురునగర్ కాలనీలలో వరద నీటి కాలువల నిర్మాణం చేపట్టి కాలనీలు వరద ముంపునకు గురికాకుండా చేశాం. వనస్థలిపురం కాంప్లెక్స్ నుంచి వనస్థలిపురం ఫేజ్–4 వరకు బీటీ రోడ్లను తిరిగి నిర్మించాము.

ప్రశ్న: ప్రస్తుతం జరుగుతున్న, చేపట్టబోయే అభివృద్ధి పనులు ఏమిటి?

జవాబు: నాగార్జున కాలనీ, క్రిస్టియన్ కాలనీ, శ్రీనివాసపురం కాలనీలలో రోడ్ల నిర్మాణం జరుగుతోంది. గుంటి జంగయ్యనగర్, సద్గురునగర్‌లలో రూ. 80 లక్షలతో నిర్మించే రోడ్ల పనులు త్వరలో ప్రారంభం అవుతాయి. జనప్రియ హోమ్స్‌లో మహిళా భవనం రెండవ అంతస్తు నిర్మాణం చేపడుతున్నాం. ప్రశాంత్‌నగర్‌లో మహిళా భవనం పెండింగ్ పనులు పూర్తిచేయిస్తాం.

ప్రశ్న: వనస్థలిపురంలో శిథిలావస్థకు చేరుకున్న ఆడిటోరియంను పునరుద్ధరిస్తారా?

జవాబు: వనస్థలిపురంలో ఆడిటోరియం శిథిలావస్థకు చేరుకుంది. ఆడిటోరియంను అభివృద్ధి చేస్తామని ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చాం. ఆడిటోరియం ప్రాంగణం హెచ్‌ఎండీఏ పరిధిలో ఉంది. ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో మాట్లాడి ఆడిటోరియంను మినీ రవీంద్రభారతిగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తా.

ప్రశ్న: డివిజన్‌లో నిర్మించిన మోడల్ మార్కెట్ ప్రారంభానికి నోచుకోలేదు, కారణమేమిటి?

జవాబు: ఎఫ్‌సీఐ కాలనీలో మోడల్ మార్కెట్‌ను నిర్మించినా అది ఇంకా ప్రారంభం కాలేదు. మార్కెట్‌లో షాపులను చిరు వ్యాపారులకు కేటాయించాల్సి ఉంది. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అధికారులతో మాట్లాడి షాపులను అలాట్‌మెంట్ చేయించడానికి తగిన చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రాబోయే రోజుల్లో డివిజన్ అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

జవాబు: డివిజన్ వాసులకు నిత్యం అందుబాటులో ఉంటున్నాను. రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే, అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాలతో సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై నిరంతరం కృషి చేస్తాను. డివిజన్‌ను చెత్త రహితంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నాం.